క్లుప్తంగా

నేడు ఎంపీ అభ్యర్థి ఉమామాల నామినేషన్


గూడూరి ఉమాబాల

భీమవరం: నరసాపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు పార్టీవర్గాలు తెలిపాయి. శుక్రవారం ఉదయం 9 గంటలకు పీపీ రోడ్డులోని ఉమాబాల ఇంటివద్ద నుంచి పాదయాత్రగా బయలుదేరి కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు గ్రంధి శ్రీనివాస్ నామినేషన్


గ్రంధి శ్రీనివాస్

భీమవరం: భీమవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఇంటి వద్ద నుంచి పాదయాత్రగా బయలుదేరి ఉదయం 11 గంటలకు మునిసిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నామినేషన్‌కు తరలిరావాలి

వీరవాసరం: భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గ్రంధి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన గ్రంధి శ్రీనివాస్ కు మనమంతా బాసటగా నిలవాలని ఆకాంక్షించారు.

నేడు పీవీఎల్ నామినేషన్


పీవీఎల్ నరసింహరాజు

ఉండి, కాళ్ల, ఆకివీడు: వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజు శుక్రవారం ఉదయం 10.58 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు పార్టీ ఉండి మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఉదయం 9 గంటలకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద అమిరంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంకు తరలిరావాలని ఆయన కోరారు. అక్కడి నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి ఉండి తహసీల్దార్ కార్యాలయానికి నామినేసన్ వేసేందుకు వెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మే 11న జాతీయ లోక్‌అదాలత్

భీమవరం: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు భీమవరం 3వ అదనపు కోర్టు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని భీమవరం కోర్టు హాల్లో న్యాయమూర్తి భీమవరం రూరల్, ఆకివీడు, వీరవాసరం, కాళ్ల, పాలకోడేరు కోర్టు ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయా కోర్టుల్లో పెండింగ్ లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్ కేసులను గుర్తించి ఇరుపక్షాల వారిని సమన్వయం చేసి లోక్‌అదాలత్ ముఖ్య ఉద్దేశమైన రాజీయే రాజ మార్గం ద్వారా పలు ఎక్కువ కేసులు రాజీ చేసే దిశగా పోలీస్ అధికారులు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు.

జూదరుల అరెస్ట్

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టు వద్ద పేకాడుతున్న ముగ్గురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బీ.నాగబాబు గురువారం చెప్పారు. వారిని కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

- పేదలకు వరంగా ఫ్యామిలీ ఫిజీషియన్
- దీర్ఘకాలిక రోగులకు అధిక ప్రయోజనం



మోగల్లులో ఇంటింటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ చినమిల్లి రంగంనాయుడు (ఫైల్), గొరగనమూడిలో హెల్త్ క్లినిక్ భవనం

పాలకోడేరు: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ రోగులకు వరంగా మారింది. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షల కోసం గతంలో ఇబ్బందులు పడుతూ పట్టణాలకు వెళ్లేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమల్లోకి వచ్చిన తరువాత నిర్ధేశిత సమయంలో రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు వచ్చి వైద్యపరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో పాలకోడేరు, ఉండి, ఆకివీడు కాళ్ల మండలాల్లోని 72 గ్రామాల్లో ఇప్పటి వరకు 1108 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో 87,506 మంది వైద్య సేవలు పొందారు.

సుగర్, బీపీ రోగులకు భరోసా

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయస్సుతో నిమిత్తం లేకుండా సుగర్, బీపీ వంటి రోగాలు పట్టిపీడిస్తున్నాయి. వీటివల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేదలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలు చేయలేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి నెలా వైద్యులు ఇంటికే వచ్చి రక్తం, యూరిన్ పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు ఇవ్వడంతో పేదలకు ఆర్థికబారం తగ్గి ఆరోగ్యంగా జీవిస్తున్నారు. ఇప్పటికే ఉండి నియోజకవర్గంలో 9,250 మంది సుగర్, బీపీ రోగులకు సేవలు అందుతున్నాయి.

గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆర్థిక స్తోమత లేని వారు చికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితం అయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వైద్య రంగానికి పెద్ద పీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 104, 108 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు చికిత్సలు అందుతున్నాయి ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఆసుపత్రికి వెళ్లలేని రోగులు ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది. ఇప్పటికే చాలాచోట్ల హెల్త్ క్లినికల్ నిర్మాణాలు శరవేగంగా జరిగాయి. మిగిలిన చోట్ల ఉన్న భవనాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారు. 2500 మంది జనాభాకు ఒక సెంటర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతోపాటు ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉండి సేవలందిస్తారు

సీఎంకు ధన్యవాదాలు



ప్రతి నెలా వైద్య బృందం గ్రామాల్లోకి వచ్చి రక్త, యూరిన్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. అసలు రోగం ఉందనే భయం లేదు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వల్ల మా అయుష్షు పెరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.

– గుడాల సాంబమూర్తి, జీవీ పాలెం

జీవితంపై ఆశ కలుగుతోంది



నాకు హైపర్ టెన్షన్ వ్యాధి ఉంది. ఇంట్లో ఆర్థిక ఇబ్బంది. పని మానుకుని నన్ను దూరప్రాంతం ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చేది. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వల్ల ఇంటి వద్దకే వైద్య సిబ్బంది వచ్చి పరీక్షలు చేసి, మందులు ఇస్తున్నారు. జీవితంపై ఆశ కలుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. – జి సత్యనారాయణ మోగల్లు

తొలిరోజు నామినేషన్లు నిల్


ఉండి తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్న అధికారులు

ఉండి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆధ్వర్యంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు నియోజకవర్గంలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే నామినేషన్‌ల ప్రక్రియ జరుగుతుందని, అభ్యర్థులంతా గమనించాలని కోరారు.

మే 1 నుంచి సువార్త సభలు

ఉండి: మే 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉండి చిక్కాలవీరన్న నగర్‌లోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ జీ లూథర్ తెలిపారు. ఉండి పెదపేట ప్యారిష్ పాస్టర్ ఎం.ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించే ఈ సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ జాన్‌వెస్లీ (ఏలూరు), బ్రదర్ పీ జేమ్స్(వేట్లపాలెం), బ్రదర్ జాన్ (అమరావతి) విచ్చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశ్వాసులు ఈ సభలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని కోరారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ వారికి శృంగవృక్షం గ్రామానికి చెందిన దండు రామకృష్ణంరాజు -జయజ్యోతి దంపతులు గురువారం 8 గ్రాముల బంగారం సమర్పించారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు నిర్వహించి ఫొటో శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

వైభవంగా రాములోరి రథోత్సవం

ఆకివీడు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల గ్రామోత్సవం వైభవోపేతంగా జరిగింది. రథంలో సీతాదేవితో కొలువుదీరిన కోదండరాముడు గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వెలంపేట, ఎస్ టర్నింగ్, సిద్దాపురం, మాదివాడలోని రామాలయాల వద్ద స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక వనువులమ్మ ఆలయం వద్ద రథం ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ పొన్నాడ నాగమణి ప్రారంభించారు. రథోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత నవమి రెండో రోజు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

మరోసారి ఎమ్మెల్యేగా గ్రంధి గెలవడం ఖాయం


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతున్న హిజ్రాలు

భీమవరం: వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి భీమవరం ఎమ్మెల్యేగా గ్రంధి శ్రీనివాస్ అఖండ మెజార్టీతో గెలుస్తారని హిజ్రాల నాయకురాలు పాడపాటి సిమ్రాన్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని హిజ్రాలు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు సమాజంలో ప్రభుత్వం ద్వారా తగిన గుర్తింపు వచ్చే విధంగా కృషి చేసిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శిల్ప, అనన్య, బూరాబత్తుల జ్యోతి, అశ్విని, సన, కుమారి, సారిక తదితరులున్నారు.

నెరవేర్చే హామీలను మాత్రమే సీఎం జగన్ ఇస్తారు

భీమవరం: నెరవేర్చే హామీలను మాత్రమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇస్తారని, 2019 ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 1, 3,24,39 వార్డులకు సంబంధించిన టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు భారీగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడానికి ఎన్డీఏ కూటమి తరుపున అభ్యర్థులు ప్రజల్లోకి వస్తున్నారని, వారిని ,వారి హామీలను ప్రజలు నమ్మొద్దని అన్నారు. అయితే 2014లో 600 కి పైగానే హామీలను ఇచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని గుర్తుచేశారు. కానీ 2019లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కరోనాలో సైతం కూడా అమలు చేశారని అన్నారు. ముఖ్యంగా భీమవరం నియోజకవర్గంలో ఈ 58 నెలల కాలంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో సుమారుగా 15 వేల మందికి పైగానే పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను ఇచ్చామన్నారు. మరో ప్రక్క ప్రతి గ్రామంలోనూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, మాదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిట్టిరాజుకు అభినందనలు


చిట్టిరాజును అభినందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: సివిల్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 833 వ ర్యాంకు సాధించిన ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడు కొయ్యే చిట్టిరాజును రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభినందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్టిరాజు సాధించిన విజయం దేశానికి రాష్ట్రానికి నియోజకవర్గానికి గర్వకారణమని అన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో పట్టుదల, కృషితో చిట్టిరాజు సివిల్స్‌లో మంచి ర్యాంకును సాధించి తల్లి దండ్రులకు, భీమవరం ప్రజలకు , దేశ రాష్ట్ర ప్రజలకు గర్వకారణంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట భోగయ్య, కామన నాగేశ్వర రావు, కోడె యుగంధర్ విజయలక్ష్మి, ఏఎస్ రాజు, నల్లం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు గర్వకారణం

భీమవరం: 2024వ సంవత్సరం సివిల్స్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు కుమారుడు కొయ్యే చిట్టిరాజును భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు అభినందించారు. జాతీయ స్థాయిలో 833 వ ర్యాంకు సాధించి సివిల్ సర్వీసెస్‌కి సెలెక్ట్ అవడం మన జిల్లాకే గర్వకారణమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస గుప్తా, పిఆర్‌ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు (బీఎస్‌ఆర్) అన్నారు. క్లబ్ సభ్యులు కారుమూరి సత్యనారాయణ, కనగర్ల కిషోర్, కోట్ల నాని, మానేపల్లి వెంకన్న బాబు గుండు కిషోర్, సకల కుమార్, మానేపల్లి రవి చిన్నారావు, గాదె నాగేశ్వరావు, హిందూస్తాన్ సుబ్బారావు తదితరులు చిట్టిరాజును సత్కరించి అభినందించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు


గుమ్ములూరుకు చెందిన 11 మంది వలంటీర్లు ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలో 41 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై టీడీపీ కూటమి చేస్తున్న దుష్ప్రచారానికి నిరసనగా రాజీనామా చేసినట్లు వెల్లడించారు. గౌరవ వేతనంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని పేదలకు చేరవేస్తున్న తమపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్ములూరు గ్రామానికి చెందిన 11 మంది, కాళింగగూడెం నుంచి 6గురు, ఆకివీడు-1 సచివాలయం నుంచి 22 మంది, చెరుకుమిల్లిలో ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసినట్లు చెప్పారు. ఇకనుంచి జగనన్నకు మద్దతుగా ప్రచారం చేస్తామని చెప్పారు. కాగా మండలంలో మొత్తం 273 మంది వలంటీర్లకుగాను ఇప్పటివరకూ 212 మంది తమ రాజీనామా పత్రాల్ని ఎంపీడీఓకు అందజేశారు.

ఉపయోగకరమైన ప్రాజెక్టులు చేపట్టాలి

భీమవరం: అధునాతన టెక్నాలజీని సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడంలో ఇంజినీరింగ్ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిన్ని మరింత లోతుగా పరిశోధనలు జరిగితే మంచి ఫలితాలు వస్తాయని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించి పలు ప్రాజెక్టులు రూపొందించారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రాజెక్టు ఎక్స్‌పోను డాక్టర్ ఎం.జగపతిరాజు ప్రారంభించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, సీఎస్సీ అధ్యాపక బృందం డాక్టర్ కె.శ్రీహరి వర్మ, డాక్టర్ వీవీ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీరపేరంటాలమ్మ జాతర

ఉండి: వీరపేరంటాలమ్మ 71వ వార్షిక మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈనెల ఈనెల 9న ప్రారంభమైన జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పదిరోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన జరిపారు. జిల్లా నుంచే కాకుండా కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: రాయలం విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం 11కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లు వార్షిక మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయలం, బీసీ కాలనీ, బలుసుమూడి, డీఎన్ఆర్ కళాశాల ఏరియా, రామలక్ష్మణ్ నగర్, గొల్లవానితిప్ప రోడ్, ప్రకాష్ నగర్, కొమరాడ రోడ్, గొర్లమూడి, కొమరాడ, అనాకోడేరు, తుమ్మగొప్పు, ఈలంపూడి గ్రామాలతో పాటు ఇండస్ట్రియల్ లైన్లు, ఆక్వా లైన్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో

గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్లు, కొమ్మ తొలగించే నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గొల్లవానితిప్ప, ఎల్‌వీఎన్ పురం, (ఎఫ్ఎల్ సొసైటీ), పల్లిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.